


# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**JULY-2014**

సంవత్సర చందా రూ. 50/-

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

సత్యవాణి టి.వి. కార్యక్రమములను దిగువ

సమయాల్లో వీక్షించండి

**ప్రతి ఆదివారము సాయంత్రం 6.00 గం॥లకు శుభవార్త**

**ప్రతి బుధవారం సాయంత్రం 6.30 ని॥లకు రక్షణ**

**ప్రతి గురువారం ఉదయం 11.00 ని॥లకు రక్షణ**

**ప్రతి రోజు సాయంత్రం 8.00 గం॥లకు శక్తి ఛానల్‌లలో వీక్షించండి.**

సత్యవాణి TV కార్యక్రమములు ఇప్పుడు You Tube లో ఎప్పుడైనా, ఎక్కడైనా చూడవచ్చును.

సత్యవాణి TV కార్యక్రమములను Online లో ప్రతి రోజు రాత్రి ప్రపంచములో ఎక్కడైనా చూడవచ్చును.

www.sakthitv.in కు వెళ్లి Live Relay ను క్లిక్ చేయండి.

Sakthi TV లో వాక్యపరిచర్యచేయాలనుకొను వారు
Bro. B.మాధవరావ్,

(Cell No: 9848123500) గారిని సంప్రదించండి.

---

ఉచిత బైబిల్ కరస్పాండెన్సు కోర్సు కొరకు మాకు వ్రాయండి

SATYA VANI

P.O.BOX.80, KAKINADA

Pin - 533004

# సత్యవాక్కు
# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 33 | జూలై - 2014 | సంచిక - 12


## నీవు క్రీస్తునందున్నావా?
## (Are you in Christ ?)

2 కొరింధీ 5:17లో ఇట్లు వ్రాయబడి యున్నది : "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి: పాతవిగతించెను, ఇదిగో క్రొత్త వాయెను", ఒకడు క్రీస్తునందున్న యెడల అతడు దేవునితో సహవాసము గలవాడు. క్రైస్తవుడు కాకముందు ఒకడు పాపములో యున్నవాడు. అతడు పాపమును విసర్జించి, క్రీస్తును ధరించుకొనిననాడు క్రీస్తునందున్న వాడగును. అతడు నూతన సృష్టియని పరిశుద్ధాత్ముడు పలుకుచున్నాడు.

మానవుడు పాపముతో పుట్టిన వాడు కాదు, సరిగదా అతడు దేవునికి అవిధేయుడగుట వలన పాపములో ప్రవేశించును. పసిబిడ్డలు పరలోకమున కర్హులని యేసు మత్తయి 19:14లో బోధించెను. వయస్సు వచ్చినవారు దేవుని ఆజ్ఞలనతిక్రమించుటయే పాపము (1యోహాను 5:19). మానవుడు పాపమందు నిలిచి యుండరాదు (రోమా 6:1). పాపముతో తనకు గల సంబంధ మునతడు తృంచివేయవలెను. క్రీస్తు నందెవరయితే లేరో వారు తమ అపరాధముల చేతను, పాపముల చేతను

ఆత్మీయముగా చచ్చినవారని బైబిలు బోధించుచున్నది (ఎఫెసీ 2:1).

దేవుడు పాపమును ద్వేషించువాడు. పాపము వలన మనము దేవునితో సరియైన సహవాసము కలిగియుండుట అసాధ్యము. అందుకే "మీ దోషములు మీకును మీదేవునికిని అడ్డముగా వచ్చెను. మీపాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను. గనుక ఆయన ఆలకింపకున్నాడు" అని యెషయా ప్రవక్త పలికెను (యెషయా 59:1,2). పాపము దేవుని తత్వమునకు ఖచ్చితముగా వ్యతిరేకమైనది గనుక ఆయన పాపముతో సహవాసము చేయడు.

అయితే దేవుడు మానవుని ప్రేమించినందు వలన అతని పాపములు క్షమించబడి తిరిగి దేవునితో సహవాసము నేర్పరచుకొను విధానమును ఆయన నెలకొల్పెను. పాపపరిహారార్ధబలిగా దేవుడు తన కుమారుని ఈలోకమునకిచ్చెను. మానవుల పాపముల కొరకు యేసు శిక్షను భరించెను, అట్లు చేసి మానవులను శిక్ష నుండి తప్పించెను. అయితే పాపక్షమాపణ నొందుటకు మనము క్రీస్తునందుండవలెనని దేవుడు కోరుచున్నారు. పాపక్షమాపణను, రక్షణను ఆయన క్రీస్తులోనే యుంచెను. క్రీస్తు యొక్క మరణములోనే మానవుల పాపములు క్షమించబడును (ఎఫెసీ 1:7).

ఒకడు క్రీస్తునందున్న యెడల రక్షణ, నిరీక్షణ, సంతోషము కలిగినవాడై యుండును. ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును ఆయన మనకు క్రీస్తునందు అనుగ్రహించెను అని ఎఫెసీ 1:3లో వ్రాయబడి యున్నది. మనము క్రీస్తునందున్న యెడల దేవుని ప్రేమ మనకు లభించును (రోమా 8:39, 1తిమో 1:14). దేవుని యొక్క కృప మనకు క్రీస్తునందు లభించును (1కొరింధి 1:4, 2 తిమో 2:1). క్రీస్తునందున్న యెడల మనము దేవుతో సమాధానము కలిగిన వారమగుదుము (2 కొరింథీ 5:17). పాపము నుండి విమోచన మనకు క్రీస్తునందే లభించును. "కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు" (రోమా 3:24). పాప క్షమాపణ క్రీస్తు యేసునందే కలదని ఎఫెసీ 1:7లో వ్రాయబడి యున్నది. ఇంకను ఇట్టి ఆశీర్వాదములనెన్నిటినో క్రీస్తు యేసునందు దేవుడు మనకు లభింపజేయుచున్నాడు. అయితే క్రీస్తునందు లేని వారికి ఈ ఆశీర్వాదములు వర్తించవు.

క్రీస్తులోనికి మనము ఎట్లు ప్రవేశించగలము? అనే ప్రశ్న మీకిప్పుడు రావచ్చును. దానికి జవాబుగా

గలతీ 3:26,27లను ఇప్పుడు చదువుకొందము: “యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు”. ఒకడు విశ్వాసము ద్వారా క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన యెడల అతడు దేవుని కుమారుడగునని ఈ వాక్యము చెప్పుచున్నది. ఒక మనుష్యుని విశ్వాసము, అతడు బాప్తిస్మము పొందినప్పుడు అతనిని క్రీస్తులోనికి ప్రవేశింపజేయునని ఈ వాక్యము బోధించుచున్నది. పాపక్షమాపణ క్రీస్తునందున్నది. బాప్తిస్మము పొందుట ద్వారా ఒకడు క్రీస్తులో ప్రవేశించును. ఎవరైనను క్రీస్తులోనికి బాప్తిస్మము పొందని యెడల వారు క్రీస్తును ధరించుకొనిన వారెట్లగుదురు? ఒక మనుష్యుడు క్రీస్తునందు విశ్వసించి, తన పాపముల విషయమై మారు మనస్సు పొంది, క్రీస్తులోనికి బాప్తిస్మము పొందనంత వరకు అతడు దేవునితో సహవాసము కలిగి యుండలేడు.

ఒకడు బాప్తిస్మము ద్వారా క్రీస్తును ధరించుకొనగానే ప్రభువు అతనిని తన సంఘముతో చేర్చుకొనును (అపొ.కా. 2:47). గనుక ఎవడైనను క్రీస్తునందున్న యెడల అతడు క్రీస్తు సంఘసభ్యుడై యుండునని మనము గ్రహించుకొనగలము. క్రీస్తు యేసునందున్న ప్రజలే క్రీస్తుసంఘమై యున్నారు. కొరింథులోని క్రైస్తవులు క్రీస్తు యేసునందు పరిశుద్ధపరచబడినవారై, పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడిన వారని, వారే దేవుని సంఘమని అపొ.పౌలు పలికెను (1 కొరింథీ 1:2). పాపపు లోకము నుండి సువార్త వలన పిలువబడినవారే క్రీస్తుసంఘము. అనగా క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన వారే క్రీస్తు సంఘమై యున్నారని గ్రహించవలెను. ఇంకొక మాటలో సంఘము రక్షించబడిన ప్రజలతో సమకూడినది. క్రైస్తవులు క్రీస్తు రక్తముచే పరిశుద్ధ పరచబడినవారు గనుక సంఘము క్రీస్తు రక్తముచే కొనబడినది. క్రైస్తవులే క్రీస్తు సంఘమై యున్నారు (అపొ.కా. 20:28; ఎఫెసీ 5:25).

సంఘమే క్రీస్తు శరీరమని క్రొత్త నిబంధన బోధించుచున్నది (ఎఫెసీ1:22,23; కొలస్స 1:18). మనము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందియుంటిమి. “ఏలయనగా యూదులమైనను, గ్రీసుదేశస్థులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి యని 1కొరింథీ 12:13 చెప్పుచున్నది. క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరమైన సంఘములో క్రైస్తవులు వివిధ అవయవములై యున్నారని

క్రొత్తనిబంధన బోధించుచున్నది. "ఒక్క శరీరములో మనకు అనేక అవయవము లుండినను, ఈ అవయవములన్నిటికిని ఒక్కటే పని యేలాగు ఉండదో, అలాగే అనేకులమైన మనము క్రీస్తులో ఒక్క శరీరముగా ఉండి, ఒకనికొ కరము ప్రత్యేకముగా అవయవములై యున్నాము" (రోమా 12:5). క్రైస్తవు లందరు ఏకమై యుండవలెనని యేసు ప్రార్థించెను (యోహాను 17). యేసుక్రీస్తు నందు మీరందరు ఏకముగా ఉన్నారని పౌలు గలతీయలోని క్రైస్తవులకు వ్రాసెను (గలతీ 3:28). క్రైస్తవులు ప్రభువునందు ఏకమనస్సు గలవారై యుండవలెనని అతడనేకసార్లు హెచ్చరించెను (ఫిలిప్పీ 4:2). క్రీస్తుయేసునందు దేవునితో సహవాసము గలవాడు, క్రీస్తు యేసునందు దేవునితో సహవాసము గలవారితో సహవాసము కలిగియుండవలెను. ఒకేప్రభువు, ఒకే విశ్వాసము, ఒకే బాప్తిస్మము ఎట్లున్నవో అట్లే సంఘము కూడ ఒక్కటే యున్నదని క్రొత్త నిబంధన బోధించుచున్నది (ఎఫెసీ 4:4,5). వేర్వేరు సంఘములుగా అనగా క్రైస్తవమత శాఖలుగా విడిపోవుట పాపము అని మనము గ్రహించవలెను.

మనము క్రైస్తవులమై యున్న యెడల క్రీస్తునందును, ఆయన సంఘ మందును ఉన్న వారమని గ్రహించ వలెను. ఒకడు క్రీస్తునందు లేకుండా క్రైస్తవుడగుట ఎట్లు అసాధ్యమో అట్లే సంఘమునందు లేకుండా క్రైస్తవుడై యుండుట అసాధ్యము.

ఒకడు క్రీస్తునందున్న యెడల అతడు దేవునికొరకు ఫలములు ఫలించవలెనని బైబిలు బోధించుచున్నది. "నాయందు నిలిచి యుండుడి, మీ యందు నేనును నిలిచియుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచియుంటేనే గాని తనంతట తానే యేలాగు ఫలింపదో, అలాగే నాయందు నిలిచి యుంటేనే కాని మీరు ఫలింపరు. ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరును ............... నాకు వేరుగా యుండి మీరేమియు చేయలేరు. ఎవడైనను నాయందు నిలిచి యుండని యెడల వాడు తీగెవలె బయట పార వేయబడి యెండిపోవును; మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పార వేతురు. అవి కాలిపోవును" అని యేసు బోధించెను (యోహాను 15:4-6). క్రీస్తునందుండియు ఫలములు ఫలింపని క్రైస్తవులు యెండిపోయిన తీగలవలె నిత్యాగ్నికి లోనగుదురని యేసు బోధించెను.

ఒకడు క్రీస్తునందుండిన యెడల నిత్యజీవ నిరీక్షణ అతనికి కలదు. ఒకడు మరణ పర్యంతము యేసుక్రీస్తుకు నమ్మకముగా జీవించిన యెడల అతనికి

నిత్యజీవము అనే కిరీటము వాగ్దానము చేయబడినది (ప్రకటన 2:10). అందుకే ప్రభువు నందు మృతినొందు మృతులు ధన్యులు అని ప్రకటన 14:13లో వ్రాయబడి యున్నది. క్రీస్తునందు మృతులైనవారెవరు? క్రీస్తునందు మృతులైనవారు క్రీస్తునందు విశ్వసించి, తాము మృతినొందే వరకు ఆయనకు విధేయత చూపించినవారు.

నీవు క్రీస్తునందున్నావా? ఎవడైనను క్రీస్తునందున్న యెడల అతడు నూతన సృష్టియగునని దేవుని వాక్యము చెప్పుచున్నది. యేసు దేవుని కుమారుడని విశ్వసించుము (యోహాను 8:24). నీపాపముల విషయమై మారుమనస్సు నొందుము (లూకా 13:3), నీ విశ్వాసమును ఒప్పుకొనుచూ, పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము (అపొ.కా. 2:38). అప్పుడాయన నిన్ను క్రీస్తులోను ఆయన సంఘములోను చేర్చి పరిశుద్ధాత్మ అను వరమును తప్పక నీకు అనుగ్రహించును.

## నిష్ఫలమైన అంజూరపు చెట్టు
## (The Barren Fig Tree)

లూకా 13:1-9

పరిచయము :

దేవుని యొక్క శిక్షకు సూచనగా ప్రజలకు కీడు జరుగుననే అపోహను పురస్కరించుకొని ఈ ఉపమానము చెప్పబడియున్నది. గలిలయలో కొందరు యూదులు బలులర్పించుచుండగా దేవాలయములో పిలాతు వారిని చంపెను. ఈ సంగతిని కొందరు యేసుకు తెలియజేసిరి. "పిలాతు గలిలయులైన కొందరి రక్తము వారి బలులతో కలిపియుండెను; ఆకాలమున అక్కడ నున్న కొందరు ఆసంగతి యేసుతో చెప్పిరి" (లూకా 13:1).

అట్లు మరణించిన యూదులు గలిలయలోని మిగతా ప్రజలకంటే యేమీ పాపులు కాదని యేసుచెప్పెను. మరియు సిలోయములోని గోపురము పడిచచ్చిన ఆపదునెనిమిదిమంది యెరుషలేములో కాపురమున్న వారందరి కంటె అపరాధులు కారని" యేసువారికి బోధించెను (లూకా 13:2-5). ఈ సందర్భాన్ని బట్టి యేసు వారికి మారు మనస్సును గూర్చి బోధించెను. మానవులందరు అన్నిచోట్లమారుమనస్సు పొందవలెను (అపొ.కా. 17:30-31). మీరు మారుమనస్సుపొందని యెడల మీరందరు ఆలాగేనశింతురు" అని యేసు పై సందర్భములో బోధించెను (లూకా

13:2-5).

నాబంధువురాలు ఒకామె 40 సంవత్సరముల వయస్సులో గర్భవతియై అంగవైకల్యము గల బిడ్డకు జన్మనిచ్చెను. అట్టి బిడ్డ నిచ్చి దేవుడు తనను, తన కుటుంబాన్ని శిక్షించారని ఆమె తలంచెను. యోబుకు కలిగిన దుర్దశ అతడు రహస్యముగా చేసిన పాపఫలితమై యుందునని అతని మిత్రులు తలంచారు. అపొ.పౌలును ఒక విషసర్పము చుట్టు కొని కాటు వేయగా నిశ్చయముగా అతడు నరహంతకుడు గనుక న్యాయమునుండి తప్పించుకొనలేకపోయెనని మిలేతు వాస్తవ్యులు తలంచారు. "పౌలు మోపెడు పుల్లలేరి నిప్పుల మీద వేయగా ఒక సర్పము కారుకు బయటకు వచ్చి అతని చెయ్యివట్టెను. ఆ ద్వీపవాసులు ఆజంతువతని చేతిని వ్రేలాడుట చూచి నప్పుడు- నిశ్చయముగా ఈమనుష్యుడు నరహంతకుడు; ఇతడు సముద్రము నుండి తప్పించుకొనినను న్యాయమాతని బ్రదుక నియ్యదని తమలో తాము చెప్పుకొనిరి" (అపొ.కా. 28:3-4).

యేసు యొక్క శిష్యులు కూడ ఇట్టివి దైవ ఉగ్రతకు సూచనలని తలంచేవారు. "ఆయన మార్గమున పోవుచుండగా పుట్టుగ్రుడ్డియైన యొక మనుష్యుడు కనబడెను. ఆయన శిష్యులు -బోధకుడా, వీరు గ్రుడ్డివాడై పుట్టుటకు ఎవడు పాపము చేసెను? వీడా, వీని కన్నవారా? అని ఆయననడిగిరి" (యోహాను 9:1-2).

నా బంధువురాలు పొరబడింది యోబు యొక్క మిత్రులు కూడ పొరబడ్డారు. పౌలు విషయమై మిలేతు వాస్తవ్యులు కూడ తప్పుగా తలంచారు. పావముకు, శరీరవైకల్యానికి సంబంధమున్నట్లు తలంచి యేసు శిష్యులు కూడ పొరబడ్డారు.

మారు మనస్సు యొక్క అవశ్యకతను గూర్చి యేసు ఈ ఉపమానము చెప్పారు. గతంలో చేసిన పాపఫలితముగా రోగము. వ్యాధి, బాధ, ఘోరమరణము మొదలైనవి కలుగునని యేసుకాలమునాటి ప్రజలు తలంచే వారు. ఇవ్విధమైన మనస్సు గలిగి కొందరు యేసు దగ్గరకు వచ్చి గలిలయలో పిలాతు చేసిన ఘోరకృత్యాన్ని గూర్చి ఆయనకు చెప్పారు. మారు మనస్సును గూర్చి చెబుతు యేసు నిష్ఫలమైన అంజూరపు చెట్టుయొక్క ఉపమానమును బోధించారు. ఈ ఉపమానము కూడా లూకా సువార్తలో మాత్రమే అగుపడును.

**ఉపమానము :**

"మరియు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను - ఒక మనుష్యుని ద్రాక్షతోటలో అంజూరపు చెట్టు ఒకటి

నాటబడియుండెను. అతడు, ఇదిగో మూడేండ్ల నుండి నేను ఈ అంజూరపు చెట్టున పండ్లు వెదకుచున్నాను గాని యేమియు దొరకలేదు; దీనిని నరికి వేయుము. దీనివలన ఈ భూమియు ఏల వ్యర్థమైపోవలెనని ద్రాక్షతోటమాలితో చెప్పెను. అయితే వాడు అయ్యా నేను దాని చుట్టు త్రవ్వి యెరువు వేయుమట్టుకు ఈ సంవత్సరము కూడ ఉండనిమ్ము అది ఫలించిన సరి, లేని యెడల నరికించి వేయుమని అతనితో చెప్పెను" (లూకా 13:6-9).

వ్యవసాయము, దానివలన వచ్చు పంట మొదలగు వాటిని గూర్చి తరుచు బైబిలునందు చెప్పబడినది. అదే రీతిగా ఫలింపని వృక్షములను, పంటను నరికి వేయడం కూడ తరుచు చెప్పబడినది. "ఇప్పుడే గొడ్డలి చెట్ల వేరున ఉంచబడి యున్నది గనుక మంచి ఫలము ఫలింపని ప్రతి చెట్టును నరకబడి అగ్నిలో వేయ బడును" (మత్తయి 3:10).

"అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తపడుడి. వారు గొర్రెల చర్మములు వేసికొని మీ యొద్దకు వత్తురు కాని లోపలవారు క్రూరమైన తోడేళ్లు. వారి ఫలము వలన మీరువారిని తెలిసి కొందురు. ముండ్ల పొదలలో ద్రాక్షపండ్లనైనను పల్లేరు చెట్లను అంజూరపు పండ్లనైనను కోయుదురా? ఆలాగుననే ప్రతి మంచి చెట్టు మంచి ఫలములు ఫలించును, పనికిమాలిన చెట్టు మంచి ఫలములు ఫలింపనేరదు. మంచి ఫలములు ఫలింపని ప్రతిచెట్టు నరకబడి అగ్నిలో వేయబడును. కాబట్టి మీరు వారి ఫలముల వలన వారిని తెలిసికొందురు" (మత్తయి 7:15-20).

"నేను నిజమైన ద్రాక్షావల్లిని, నా తండ్రి వ్యవసాయకుడు. నాలోఫలింపని ప్రతి తీగెను ఆయన తీసిపారవేయును ఫలించు ప్రతి తీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలో పనికిరాని తీగెలను తీసివేయును. నేను మీతో చెప్పిన మాటను బట్టి మీరిప్పుడు పవిత్రులై యున్నారు. నాయందు నిలిచి యుండుడి, మీయందు నేనును నిలిచియుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచియుంటేనే గాని తనంతట తానే యేలాగు ఫలింపదో, ఆలాగే నాయందు నిలిచి యుంటేనేగాని మీరును ఫలింపరు. ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు. ఎవడు నాయందు నిలిచి యుండునో వాడు బహుగా ఫలించును. నాకు వేరుగా యుండి మీరేమియు చేయలేరు. ఎవడైనను నాయందు నిలిచియుండని యెడల వాడు తీగె వలె బయట పారవేయబడి యెండి పోవును; మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలోపారవేతురు, అవి కాలిపోవును" (యోహాను 15:1-6).

నిష్ఫలమైన అంజూరపు చెట్టుయొక్క ఉపమానము యూదులను గూర్చి చెప్ప బడినది. వ్యక్తిగతముగాను, జాతిపరము గాను వారు నిష్ఫలులైరి. పాతనిబంధనలో కూడ ఫలవంతమైన తోట, లేక ఫల భరితము కాని చెట్లను గూర్చి ఇట్లే చెప్పబడినది (యెషయా 5:1-7). ఈ ఉపమానములో చెప్పబడిన విధముగా యెషయాలో కూడ పనికిరాని చెట్లయొక్క లేక తోటయొక్క వినాశము గూర్చి చెప్పబడినది. వారు ఫలించునట్లు ప్రత్యేక అవకాశములు కల్పించినను ఫలింపలేక పోయిరి. ఫలింపని అంజూరపు చెట్టు ఉపమానములో అదే దృశ్యము కనబడు చున్నది. ఈ రెండు లేఖన భాగములు నేరుగా యూదులకే వర్తించెను. "నన్ను వెదకని వారికినేను దొరికితిని; నన్ను విచారింపనివారికి ప్రత్యక్షమైతిని అని చెప్పుచున్నాడు. ఇశ్రాయేలు విషయమైతే - అవిధేయులై యెదురాడు ప్రజలకు నేను దినమంతానా చేతులు చాచితిని" అని చెప్పుచున్నాడు (రోమా 10:2).

ఫలింపని అంజూరపు చెట్టుయొక్క యజమాని దేవుడే. తోటమాలి యేసుక్రీస్తు. ఫలింపని అంజూరపు చెట్టు యూదులు. ఆ చెట్టు నాటబడిన తోట దేవుడు ఇశ్రాయేలుకు యిచ్చిన ప్రత్యేక ఆధిక్యతలు.

ఈ అంజూరపు చెట్టు ఒక ద్రాక్షతోటలో నాటబడినట్లు ఇశ్రాయేలి జనాంగమునకు తన ప్రత్యక్షతల ద్వారా దేవుడు ప్రత్యేకావకాశముల నిచ్చెను. పాత నిబంధనకాలమంతటిలోను సైన్యముల కధిపతియగు యెహోవా, తోట యజమాని వలె ఫలముల కొరకు వెదకుచు వచ్చుచుండెను.

తోటమాలి అడిగిన మూడు సంవత్సరముల కాలము దేవుని ఓర్పుకు, సహసమునకు సాదృశ్యము. అయితే తిరుగుబాటు చేయు ఇశ్రాయేలీయుల యెడల దేవుని సహనము నిత్యము వుండునదికాదు. బబులోను బానిసత్వమునుండి యూదావారు తిరిగి వచ్చినప్పటినుండి దేవుడు వారి యెడల గొప్ప సహనము కలిగియుండెను. తత్ఫలితముగా దేవుని సహనము యూదుల యెడల అంతరించక పూర్వము పాతనిబంధన ప్రవక్తలు, బాప్తిస్మమిచ్చు యోహాను, యేసుక్రీస్తు, పరిశుద్ధాత్ముడు కూడ వారికి మారు మనస్సును గూర్చిన హెచ్చరికలిచ్చిరి. యూదా జనాంగము మారుమనస్సు పొందవలెనని తన హృదయాభిలాషను గూర్చి అపొ. పౌలు వ్రాసాడు (రోమా 10:1-3).

ఈ ఉపమానములో యజమానుడు నిష్ఫలముగా యున్న ఆ అంజూరపు చెట్టును నరికి వేయుమని సెలవిచ్చెను. తిరుగుబాటు చేయుటలో

ఎడతెగక యున్న ఇశ్రాయేలు జనాంగము నాశనమునకు ముందు సూచనగా ఇది కనబడుచున్నది. యెరూషలేము నాశనము గావించబడుట దేవుని సహనము అంతమవుటకు పరాకాష్టగా నిలిచియున్నది.

నిష్ఫల క్రైస్తవుల వలన సంఘము మృతిజెందును (ప్రక 3:1-6). శరీర కార్యముల వలన నిష్ఫలము సంభవించును (గలతీ 5:19-21). లేదా క్రియలు లేనందున కూడ అది సంభవించును (మత్త 25:31-40; యాకోబు 4:17).

మానవులందరు మారుమనస్సు పొందునట్లు అనుగ్రహించబడిన సమయము పరిమితము. దేవుని ప్రత్యేక ఆశీర్వాదములు పొందు జనాంగముగా ఇశ్రాయేలు ఇక లేరు. వారు నిష్క్రమించినందువలన కలిగిన ఖాళీని యూదులు కానివారు అసంఖ్యాకముగా మార్పు జెంది పూర్తిచేసారు.

రోమా 11:17-24 లో యూదులు ఒలీవచెట్టు యొక్క సహజ కొమ్మలుగా వర్ణించబడ్డారు. ఆ కొమ్మలు నిష్ఫలమైనందున నరికివేయబడ్డాయి. అన్యజనులు ఆ ఒలీవ చెట్టుకు అంటు కట్టబడిన వారు. చెట్టు కొట్టివేయబడకుండా మరికొంత కాలము ఉండనియ్య మారుమనస్సు పొందునట్లు మరికొంత కాలము కొరకు చేసిన విజ్ఞాపనయై యున్నది. అయితే చెట్టుగొడ్డుదైతే తప్పక నరికి వేయబడును. ఎవడును నశింపవలెనని దేవుడు కోరుటలేదు గాని అందరు మారుమనస్సు పొందవలెనని కాంక్షించుచున్నారు.

"కొందరు ఆలస్యమని ఎంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడుగాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు మీయెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు. అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును, పంచభూతములు మిక్కుటమైన వేంద్రముతోలయమైపోవును. భూమియు దానిమీద నున్న కృత్యములు కాలిపోవును" (11 పేతురు 3:9-10).

"నా జీవముతోడు దుర్మార్గుడు మరణమునొందుటవలన నాకు సంతోషము లేదు; దుర్మార్గుడు తన దుర్మార్గత నుండి మరలి బ్రదుకుట వలన నాకు సంతోషము కలుగును. కాబట్టి ఇశ్రాయేలీయులారా, మనస్సు త్రిప్పుకొనుడి, మీరెందుకు మరణము

[illegible]ని తో[illegible]లి [illegible] [illegible]దురు? [illegible] ప్రభువగు యెహోవా

వాక్కు" (యెహెజ్కేలు 33:11).

దేవుని యొక్క తీర్పు ఆదుర్దాగా జరుగదు, గాని అది ఖచ్చితము (ప్రసంగి 8:11-13, 2 పేతురు 3:9).

"దుష్క్రియకు తగిన శిక్ష శీఘ్రముగా కలుగకపోవుట చూచి మనుష్యులు భయము విడిచి హృదయ పూర్వకముగా దుష్క్రియలు చేయుదురు. పాపాత్ములు నూరుమారులు దుష్కార్యములు చేసి దీర్ఘాయుష్మంతులైనను దేవునియందు భయభక్తులు కలిగి ఆయన సన్నిధికి భయపడు వారు క్షేమముగా నుందురనియు భక్తిహీనులు దేవుని సన్నిధికి భయపడరు గనుక వారికి క్షేమము కలగదనియు వారు నీడవంటి దీర్ఘాయువును పొందక పోవుదు రనియు నేనెరుగుదును" (ప్రసంగి 8:11-13).

**ముగింపు :**

తన బిడ్డలు ఫలించాలని, ఫల భరితముగా యుండాలని దేవుడు కోరుచున్నారు. ఇంకో మాటలో వారు విధేయులై యుండాలని ఆయన కోరు చున్నారు. అవిధేయులైన వారి యెడల దేవుని మహోద్రేకము అంత్యదినమందు బయలు పరచబడును.

"ప్రభువైన యేసు తన ప్రభావము కనబరచు దూతలతో కూడ పరలోకము నుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునప్పుడు మిమ్మును శ్రమపరచువారికి శ్రమయు, శ్రమ పొందుచున్న మీకు మాతో కూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే" (2 థెస్స 1:7-9).

దేవుని ప్రతిదండన తప్పించు కొనవలెనంటే సమయముండగానే మారుమనస్సు నొందవలెను. మన పాపముల యెడల దేవుని సహసమును అపార్థము చేసికొంటే కలిగే పరిణామ ములను నిష్ఫలమైన అంజూరపు చెట్టు యొక్క ఉపమానము చెప్పుచున్నది.

దేవుడు ఈలోకమున కంతటికి యజమాని. ప్రతివాని నుండి ఫలముల నాశించే హక్కు దేవునికున్నది. షరతులను విధించే హక్కు దేవుని కున్నది. ద్రాక్షతోటయు, దానిలో నాట బడిన చెట్టును యజమానికి చెందినవి గనుక దానినుండి ఫలముల నాశించే సర్వహక్కులు యజమానివే. అదే రీతిగా నిష్ఫలమైన వాటిని నరికివేయదానికి, నాశనము చేయడానికి ఆయన సర్వహక్కులు కలిగియున్నారు.

- టూస్ రష్మోర్

# దేవుడు సృష్టికర్త
## (God is Creator)

దేవుడు మన ప్రార్థనల నాలకించునని, పాపమును ఖండించునని నీతిమంతులను దీవించునని, నిత్య ప్రేమతో ప్రేమించునని గత పాఠములలో మనము నేర్చుకొని యున్నాము. దేవుడు సర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి, సర్వజ్ఞాని యని, మంచివాడని, దయగల దేవుడని కూడ మనము నేర్చుకొని యున్నాము.

**ప్రకృతి సూత్రములు సార్వభౌములా ?**

దేవుని యొక్క అన్ని లక్షణములు ఆయన మన రక్షకుడు, విమోచకుడని ప్రకటించుచున్నవి. రక్షణ, విమోచన యనునవి దేవుని ప్రజలకు ప్రాముఖ్యమైనవి, భావపూరితమైనవి. అయితే ఆయనే మన సర్వసృష్టి కర్తయని మనం జ్ఞాపకముంచుకోవాలి. అట్లుగాక మనం ప్రకృతి శక్తులనుండి ఉద్భవించా మని, కొన్ని అంధకారశక్తుల వలన మనం ఉనికి కలిగి యున్నామని భావించితే దేవుని విమోచనా శక్తియందు నమ్మిక యుంచుటకు ఆధారమేమియులేదు.

ప్రకృతిశక్తుల వలన మన జీవితం గాఢంగా ప్రభావితం చేయబడుచున్నది. తుఫానులు, వరదలు, యుద్ధములు, రోగములు, మరణము మొదలగు శక్తులపై మన ప్రభావము యేమీ వుండదు. కాని వాటి ప్రభావము మన మీద ఎక్కువగా యుండును. భౌతిక శక్తుల పై తేలియాడు ఒక బెండు వలె మనమున్నాము. మనం సృష్టింపబడిన విధానము, భౌతిక తత్త్వము కూడ ఈ భౌతిక ప్రపంచమునుండి వేరుగావించబడని విధముగా యున్నట్లు సూచించుచున్నవి. చంద్ర నక్షత్రముల యొక్క కదలికలు సయితము మన జీవనముపై ప్రభావము కలిగి యున్నవి. ఈ ప్రకృతి శక్తులు మన జీవితంపై ఇంత ప్రభావము కలిగి యున్నందున అవి మన గమ్యముపై ప్రభువులా? అట్లయినచో జీవము యొక్క భావమంటూ యేమీవుండదు ఏలయనగా సమస్త జీవానికి ఆధారమైయున్నవాని యందు నమ్మికయుంచలేము. మనం అభద్రత స్థితిలోయున్న వారమగుదుము. ఆందోళన చెందుదుము.

**విశ్వాసముకు భద్రతకు దైవసృష్టి అవసరము :**

సమస్తానికి ఆది యేమిటి అనే ప్రశ్నకు జవాబును మనం కనుగొనుట అత్యవసరము. ఈ అవసరం చాల లోతైనది. మనం ఎక్కడి నుండి వచ్చామో మన జీవన గమ్యమేమిటో తెలిసికొనుట అత్యవసరము. చీకటి శక్తులు దీనినంతటినీ కంట్రోలు చేయుచున్నట్లుయితే, మనకు [illegible]

నిరుత్సాహము, నిస్పృహ తప్ప వేరే యేదీ లభించదు. భద్రత, భావములు అసాధ్య ములైతే మనం ధైర్యాన్ని, నమ్మకాన్ని, విశ్వాస్యతను ఎందుకు కలిగి యుండాలి? మనలను సృజించిన వాడు ప్రకృతి శక్తులను కంట్రోలు చేయు చున్నారని, తద్వారా విజయం సాధ్యమే యని మనం తెలిసికోవాలి.

**సృష్టి వలన దేవుని అనుగ్రహము నిజమగుచున్నది :**

సమస్తమును సృజించి వాటిని నడుపుచున్న సార్వభౌముని యందు విశ్వాసము కలిగి యుండుట ప్రాముఖ్యము. అట్టి విశ్వాసము సజీవుడైన దేవుడే మనలను ప్రేమించి ఏలుచున్నాడు గాని అంధకారశక్తులు కాదని మనకు రుజువు చేయుచున్నది. ఆయన ఈ విశ్వాన్నంతటినీ సృజించారు గనుక దానినంతటిని ఆయన కంట్రోలు చేయుచున్నారు. ఆయన సర్వశక్తిని మనం గమనించి ఆయనే దేవుడని నిజముగా మనము నమ్మగలము. సృష్టి దేవుని యొక్క విశిష్టక్రియ ఆయన ప్రత్యేకత. అందును బట్టి ఆయన దేవుడై యున్నారు. సృష్టికర్తయైన దేవుని యందలి విశ్వాసము వలన దేవుని అనుగ్రహము మనకు యదార్థమగును. దేవుడు మనసృష్టి కర్తయైనందున ఆయన సర్వశ్రేష్టుడు, ఏలువాడు, సార్వభౌముడు, దేవుడు!

**సృష్టికర్తయైన దేవుని వలన విమోచన సాధ్యమాయెను:**

విమోచన విషయంలో క్రైస్తవులు క్రీస్తుద్వారా కలుగు విమోచనను గూర్చి ఆసక్తి కలిగి యుండుట సహజమే. దేవుడు ఆదిలో సృష్టికర్త గనుక సువార్త, రక్షణ సంకల్పము, దేవుని విమోచన శక్తి, యనువాటిని మరింత పూర్ణముగా గ్రహించుకొన వీలుపడును. అందు వలన దేవుడుతన ప్రేమను కాపుదలను ప్రకటించునపుడు, భూమ్యాకాశముల సృష్టికర్త ఆమాటలను చెప్పుచున్నట్లు తరుచు ప్రకటించును. ఆయన యందు మనము నమ్మిక కలిగి యుండుటకు అట్టినిర్ధారణ అవసరమని దేవుడెరుగును. పరిశుద్ధ లేఖనము లిట్లనుచున్నవి.

"ప్రభువా, మాదేవా నీవు సమస్తమును సృష్టించితివి, నీ చిత్తమును బట్టి అవి యుండెను. దానిని బట్టియే సృష్టింపబడెను గనుక నీవే మహిమ ఘనత ప్రభావములు పొందనర్హుడవు" (ప్రకటన 4:11).

"సమస్తమును ఆయన మూలము గా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు" (యోహాను 1:3).

"గర్భము నుండి నిన్ను నిర్మించిన విమోచకుడగు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు యెహోవానగు నేనే

సమస్తమును జరిగించువాడను" (యెషయా 44:24).

"నీకు తెలియదా? నీకు వినబడలేదా? భూదిగంతములను సృజించిన యెహోవా నిత్యుడగు దేవుడు. ఆయన సొమ్మసిల్లడు అలయడు, ఆయన జ్ఞానమును శోధించుట అసాధ్యము" (యెష 40:25). సర్వము ఆయన యందు సృజింపబడెను. సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను" (కొలస్స 1:17-18).

"ఆయన మూలమునను ఆయన ద్వారాను ఆయన నిమిత్తమును సమస్తము కలిగియున్నవి" (రోమా 11:36).

**- ఓటిస్ గేట్వుడ్**

## బాప్తిస్మమే ఎందుకు ?
## (Why Baptism?)

బాప్తిస్మమును గూర్చి చర్చించబడేదాని కన్నా మరియే అంశమును గూర్చి ప్రజలు ఎక్కువ చర్చించరు. కొందరు బాప్తిస్మము అవసరం లేదంటారు. మరికొందరు నీయిష్టా యిష్టాలకు వదిలేస్తారు. మరికొందరు బాప్తిస్మము చాల ప్రాముఖ్యమైన బైబిలు అంశము అను కొంటారు.

బాప్తిస్మము యొక్క అర్థమేమిటి? దానిని ఇచ్చేసరియైన విధాన మేమిటి? దాని ప్రయోజనం యేమిటి? అది అత్యవసరమా ? లేక అంత అవసరం కాదా ?

**ఆపదము యొక్క అర్థము :**

బాప్తిస్మమును గూర్చి క్రొత్త నిబంధన చెప్పుదానిని మనం అర్థం చేసికోవాలంటే, ఆపదము యొక్క భావాన్ని మనం సంపూర్తిగ గ్రహించాలి. 'బాప్తిస్మము' అనునది ఒక తెలుగు పదము గాని ఆంగ్లపదము గాని కాదు. గ్రీకు మాట అనువదించకుండగనే అట్లు చెప్పబడం జరిగింది.

గనుక గ్రీకులో 'బాప్టిజో' అను పదము యొక్క అర్థం యేమిటో మనం తెలిసికోవాలి. దాని యొక్క అర్థము ముంచుట, సంపూర్తిగ ముంచుట. సాధారణంగా బట్టలకు రంగు వేసేటప్పుడు వాటిని ఆరంగులో సంపూర్తిగ ఎట్లుముంచుదురో అట్లు ముంచుట యని అర్థము.

అపొ. కా. 8వ అధ్యాయములో ఫిలిప్పు అను సువార్తికుడు ఇతియోపీయ నపుంసకునికి సువార్త బోధించగా అతడు మార్పుజెందుటను మనం చూడగలము. ఆసందర్భముగా వారు "త్రోవలో వెళ్లుచుండగా నీళ్లున్న యొక చోటికి వచ్చినప్పుడు నపుంసకుడు ఇదిగో నీళ్లు, నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథమునిలుపుమని ఆజ్ఞాపించెను.

ఫిలిప్పునపుంసకుడు నీళ్లలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను. వారు నీళ్లలోనుండి వెడలి వచ్చినప్పుడు ప్రభువు ఆత్మఫిలిప్పును కొనిపోయెను" అని అపొ.కా. 8:36-38లో వ్రాయబడి యుండుట చూడగలము. ఈనపుంసకుడు నీళ్లలోనికి దిగిన తరువాత ఫిలిప్పు ఆ నీళ్లలో అతని సంపూర్తిగ ముంచి బాప్తిస్మమిచ్చెను.

బాప్తిస్మమిచ్చుయోహాను, "సలీము దగ్గర ఐనోనను స్థలమున నీళ్లు విస్తారముగ ఉండెను గనుక" అతడక్కడ బాప్తిస్మమిచ్చుచుండెనని వ్రాయబడి యున్నది (యోహాను 3:23). విస్తారమైన నీళ్లున్నచోట యోహాను బాప్తిస్మమిచ్చుటను గమనించుము. ఒకడు నీటిలో ముంచ బడునంత విస్తారమైన నీళ్లున్నచోట బాప్తిస్మమియ్యవలెను.

బాప్తిస్మములో యేసు క్రీస్తుయొక్క మరణము, సమాధి, పునరుత్థానములు చిత్రీకరించబడుచున్నవి గనుక అది చాలప్రాముఖ్యము. అపొ.పౌలు దానిని ఇట్లు వర్ణించుచున్నాడు: "ఆలాగైన ఏమందుము ? కృప విస్తరించవలెనని పాపమందు నిలిచి యుందుమా? అట్లనరాదు. పాపము విషయమై చనిపోయిన మనము ఇకమీదట ఏలాగు దానిలో జీవించుదుము?

క్రీస్తుయేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో ఆలాగే మనమును నూతన జీవము పొందిన వారమై నడుచుకొను నట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో ఐక్యముగలవారమై యున్న యెడల ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్య మందును ఆయనతో ఐక్యము గలవారమై యుందుము"(రోమా 6:1-5).

ఒకని మృతదేహాన్ని మనం భూమిలో సంపూర్తిగ కప్పిపెట్టుదుము. యేసు యొక్క మృతదేహము ఒక సమాధిలో యుంచబడి, పెద్దరాయి దాని మీద పొర్లింపబడెను. ఈ రెండు సందర్భములలోను మృతదేహము సంపూర్తిగ పాతిపెట్టబడెను.

క్రీస్తుయొక్క సమాధిని తిరిగి చిత్రీకరించుటకు బాప్తిస్మము ఉద్దేశించ బడెను. క్రీస్తు యొక్క మరణ, సమాధి పునరుత్థానములు బాప్తిస్మములో విపులీ కరించబడినవి.

**బాప్తిస్మమెందుకు ?**

అపొ.కార్యముల గ్రంథమును వ్రాయుచు బాప్తిస్మమును గూర్చి పౌలు ఎన్నిసార్లు చెప్పెనో గమనించుట మంచిది. అపొ.కా. 2లో పేతురు

యెరూషలేములో గుమిగూడిన జన సమూహమునకు యేసు పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకొస్తు దినమున సువార్త బోధించెను. వారు నిజముగా దేవునికుమారుని సిలువ వేసితిమని గ్రహించి సహోదరులారా, మే మేమి చేతుము? అని ప్రశ్నించగా, పేతురు "మీరు మారుమనస్సు పొంది పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తునామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని చెప్పెను (అపో.కా. 2:36-38).

మారు మనస్సు, బాప్తిస్మములు రెండుసంగతులు విశ్వాసికి సాధ్యపరచును. మొదటిది పాపముల క్షమాపణ, రెండవది పరిశుద్ధాత్మ అను వరము. పాపక్షమాపణ అనగా రక్షణ కలుగును, రెండవది ఒకడు రక్షింపబడగా దేవుని ప్రత్యక్షత పరిశుద్ధాత్మ అను వరములో యున్నది.

ఇంకొక సందర్భములో లూకా పౌలు క్రైస్తవుని గా మారిన సందర్భమును రికార్డు చేసాడు, అననీయ సౌలు అనబడే పౌలు నొద్దకు వచ్చి, "గనుక నీవుతడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్ధన చేసి బాప్తిస్మము పొంది నీపాపమును కడిగివేసికొనుమని చెప్పెను" (అపో.కా. 22 :16). సౌలు ఎందుకు బాప్తిస్మము పొందెను? తన పాపములు కడిగివేసికొనుటకు, అనగా రక్షణ పొందుటకు.

బాప్తిస్మము ఎందుకు? గలతీ 3:26-27ను గమనించుము: "యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు". మారుమనస్సు పొందిన విశ్వాసి బాప్తిస్మము పొందినప్పుడు క్రీస్తులో అనగా రక్షణలో ప్రవేశిస్తాడు. క్రైస్తవుడవుతాడు. దేవుని బిడ్డయవుతాడు.

యేసుక్రీస్తు యొక్క మరణ సమాధి పునరుత్థానములలో సారూప్య ముగా పాలివాడగునట్లు బాప్తిస్మము సాధ్యపరచునని యిది వరకే గమనించాము. యేసుక్రీస్తు నిజముగా దేవుని కుమారుడనే విశ్వాసము వలన ఒకని జీవితం మార్చబడును. బాప్తిస్మమునకు అంగీకరించి, బైబిలు చెప్పురీతిగా ఒకడు సంపూర్తిగా నీటిలో ముంచడము పొందితే, అతడు నూతన జీవిగా ఆనీటి సమాధి నుండి పైకివస్తాడు. అతడు క్రీస్తురక్తము వలన క్రీస్తుద్వారా రక్షించబడి క్రీస్తుసంఘ సభ్యుడవుతాడు!

- బాబీ వీట్

# దేవుని దాగలి - దేవుని వాక్యము
## (God's Anvil - God's word)

**బైబిలు దేవుని దాగలియై యున్నది :**

మనము దాగలిని గమనించిన యెడల అది అరుగదు, మన్నిక గలది, కలకాలము స్థిరముగా యుండును. అట్లే దేవుని వాక్యమైన బైబిలు కూడా అది గతాన్ని సహించి నిలిచినది, ప్రస్తుతము నిలిచి యున్నది, భవిష్యత్తులో కూడ ఎన్ని సమ్మెటలు ప్రయోగించినను అది నిలిచి యుండును. "ప్రభువువాక్యము ఎల్లప్పుడు నిలిచి యుండును" అని అందుకే పేతురు చెప్పాడు (1 పేతురు 1:24). బైబిలును వ్యతిరేకించుటకుపయోగించునది ఏమైనను సుత్తె వంటిదే. అవి నాస్థికులు, నిర్దేవులు, అబద్ధబోధకులు వంటివారు కావచ్చును. క్రీస్తుకు విరోధులైన వారందరు దేవుని వాక్యమైన దాగలిపై ప్రయోగించు సుత్తె, సమ్మెటలవంటివారే.

దాగలివలె దేవుని వాక్యము దానిపై ప్రయోగించు అస్త్రములన్నిటిని ఎట్లు తట్టుకొనుచున్నదో గమనించుము, బైబిలును నాశనము చేయుటకు నిజముగా మానవునికి శక్తి చాలదు. "మన దేవుని వాక్యము నిత్యము నిలుచును" (యెషయా 40:8). "ఆకాశము ను భూమియు గతించును గాని నామాటలు ఎన్నటికిని గతింపవు" అని యేసు చెప్పెను (మత్తయి 24:35). ప్రభువు మరల తిరిగి వచ్చినప్పుడు కూడ మానవులకు తీర్పు తీర్చుటకు దేవుని వాక్యము అక్కడ యుండును. "నన్ను నిరాకరించి నామాటలు అంగీకరింపని వానికి తీర్పుతీర్చువాడొకడు కలడు : నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పుతీర్చును" (యోహాను 12:48).

**దేవుని ప్రజలు దాగలివంటివారు :**

దేవుని ప్రజల హృదయములలో దేవుని వాక్యము హత్తుకొని యున్న యెడల వారు దేవుని దాగలివంటివార గుదురని గమనించుము. "నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నాహృదయములో నీవాక్యము ఉంచుకొని యున్నాను" అని కీర్తన కారుడు చెప్పాడు (కీర్తన119:11). "నాయందు మీరును మీయందు నామాటలును నిలిచి యుండిన యెడల మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింప బడునని" యేసుప్రభువు చెప్పారు (యోహాను 15:7).

దేవుని వాక్యము మన హృదయములో నిలిచియున్న యెడల, మనము స్థిరులుగా యుండి ఈలోక సంబంధమైన శోధనలను తట్టుకొన గలము. "మరణమైనను జీవమైనను దేవదూతలైనను, ప్రధానులైనను, ఉన్నవియైనను రాబోవునవియైనను అధికారులైనను ఎత్తయినను, లోతైనను,

సృష్టింపబడిన మరి యేదైనను మన ప్రభువైన క్రీస్తు యేసునందలి దేవుని ప్రేమనుండి మనలను ఎడబాపనేరవని రూఢిగా నమ్ముచున్నాను" (రోమా 8: 38-39).

మనము ఆయన చేసిన పనియై యున్నాము (ఎఫెసీ 2:10). అపవాదిని ఎదిరించుటకు శక్తిమంతులగునట్లు సర్వాంగకవచమును ధరించుకొందుము (ఎఫెసీ 6:13).

**క్రీస్తుసంఘము దాగలియై యున్నది :**

క్రీస్తుసంఘ సభ్యులు ఐక్యతతో నిలువబడియున్న యెడల వారు దాగలివలె యుందురు. యేసుక్రీస్తు అను పునాది మీద నిర్మించబడిన సజీవ సంస్థ క్రీస్తు సంఘము. "వేయబడినది తప్ప వేరొక పునాది ఎవడును వేయ నేరడు, ఈ పునాది యేసుక్రీస్తే" (1కొరింథీ 3:11). సంఘము సజీవమైన రాళ్లతో, క్రైస్తవులతో కట్టబడి యున్నది. "మీరును సజీవమైన రాళ్లవలె యుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడు చున్నారు" (1 పేతురు 2:5).

సంఘము సజీవమై "సత్యమునకు స్థంభమును దాని ఆధారమునై యున్నది" (1 తిమో 3:15). సంఘారంభ దినాల్లో గొప్ప హింసకలిగినను సంఘము గొప్ప శక్తితో వ్యాప్తిచెందెను. అది మూడు వేల మందితో మొదట అరంభమాయెను (అపొ.కా. 2:41). స్వల్పకాలములోనే 5 వేల మంది చేర్చబడిరి (అపొ.కా. 4:4). ఇంకా కొద్దికాలములోనే వారి సంఖ్య గొప్పగా అభివృద్ధిజెందెను. (అపొ.కా. 6:7). క్రీస్తు సంఘము నిత్యము నిలుచును (దానియే 2:44). "ఈబండ మీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని" యేసు వాగ్దానము చేసెను (మత్తయి 16:18). క్రీస్తుస్థాపించిన సంఘము ఎంత ఆశ్చర్యకరమైన దాగలియో !

ఈవర్తమానము ప్రతితరము వారికి ప్రకటింపబడవలెను: దేవుని వాక్యము అనుగ్రహించుశక్తిని బట్టి మనము చేయవలసిన రెండు సంగతు లున్నవి. మొదటిగా మనము బైబిలుతో నిలిచి యుండాలి. దానిని బోధించాలి, దాని ప్రకారము జీవించాలి.

రెండవదిగా, మన బిడ్డలకు సత్యవాక్యమును సరిగా బోధించాలి. తద్వారా ఒక తరము నుండి మరొక తరముకు సత్యము ఉపదేశించబడ్తాది. మన ప్రభువు మరల వచ్చు వరకు ప్రతి తరమునకు వాక్యము బోధించబడాలి.

కాలమును సద్వినియోగము చేసికొనాలి. సమయమును పోగొట్టుకొన కూడదు. అందరికీ వాక్యము బోధింప బడాలి. దేవుని వాక్యముతో మనము నిలకడగా యుండగలము. వాక్యము లేని యెడల నిలబడలేము, స్థిరముగా యుండ లేము. - రాండల్ఫ్ బోనాస్

## "నా నోటి మాటలు ..........
("Let the word of my Mouth")

ఒక మనుష్యుని సంభాషణను గూర్చి బైబిలు ఆలోచింపదగు హెచ్చరికల నిచ్చు చున్నది. "స్వాతంత్ర్యము ఇచ్చు నియమము చొప్పున తీర్పుపొందబోవు వారికి తగినట్టుగా మాటలాడుడి; ఆలాగుననే ప్రవర్తించుడి" (యాకోబు 2:12).

మాటలు శక్తివంతమైనవి. అవి తాత్కాలికంగా వినబడే శబ్ద తరంగాలే అయినా, వాటి ప్రభావము శక్తివంతమైనది. వాటికి భౌతిక రూపం అంటూ యేమీ లేదు. గాని మానవ హృదయభారములను అవి బాహ్యపరచును. ఎదుటి వాని స్వభావమును తెలిసికొనుటకు అవి ఉపయోగపడును. ఒకని నుండి మరొకనికి జ్ఞానము ప్రసాదించు సాధనములు అవి. మాటలు మనుష్యులను ప్రభావితము చేయును.

**మనుష్యులు లోకమును మార్చుదురు :**

మాటలు మానవుని కొలవేయును. అతడేమైయున్నాడో అవి తెలియజేయును. వైద్యుడు శరీరాన్ని పరీక్షచేసి ఒకని ఆరోగ్య స్థితిని అంచనావేయును. గాని అతని మాటలు మాత్రమే నిజముగా అతడేమై యున్నాడో తెలియజేయును. "హృదయము నిండి యున్న దానిని బట్టి ఒకని నోరు మాటలాడును" అని యేసు చెప్పెను (మత్తయి 12:34). ఒకడు మరొకని హృదయాన్ని కనుగొనాలంటే, అతని సంభాషణ వింటే చాలు. మాటలతో వేషధారి కొంత కాలము మోసగించ వచ్చును, గాని త్వరలో అతని మాటలే అతని బయలుపరచును.

తాను మాటలాడు ప్రతి మాటకు మానవుడు బాధ్యుడు, ఒకని మాటలు అతని హృదయాన్ని బహిర్గతము చేయును. ఈ లోకంలో మంచిని గాని చెడును గాని సాధించుటకు అవి సాధనములు. దేవుడు వాటిని నిర్లక్ష్యము చేయరు, మానవుడు మాటలాడు ప్రతి మాటకు అతనికి తీర్పు చెప్పబడును. అవి అతని గమ్యాన్ని నిర్ధారించును. మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శదినమున లెక్క చెప్ప వలసి యుండును. నీ మాటలను బట్టి నీతిమంతుడవని తీర్పు పొందుదువు, నీమాటలను బట్టియే అపరాధివని తీర్పుపొందుదువు అని యేసు చెప్పెను" (మత్తయి 12:36-37).

ఒకని మాటలను బట్టియే ఆ మనుష్యుని నిత్య గమ్యము నిర్ధారించబడును. ఒక మనుష్యుని సంభాషణ ఎంతప్రాముఖ్యమైనో యాకోబు ఇట్లు వర్ణించుచున్నాడు: "అనేక విషయములలో మనమందరము తప్పిపోవుచున్నాము. ఎవడైనను మాట తప్పని యెడల అట్టివాడు లోపము లేనివాడై తన సర్వశరీరమును స్వాధీనమందుంచుకొన శక్తి గలవాడగును" (యాకోబు 3:2). మానవుడు మాటతప్పుటకు అనేక మార్గములున్నవి. వాటిలో ఏదో ఒక దాని వలన

అతని ఆత్మ శిక్షించబడును.

**మోసకరమైన నాలుక :**

యేసు జీవించిన కాలములో ప్రజలలో యదార్థరత లోపించెను. మత సంబంధ ప్రజలుసయితము సత్యము పలుకు బాధ్యతను విస్మరించిరి. ఆరోజుల్లో నమ్మకము కలిగించుటకు ఒట్టుపెట్టుకొనుట పరిపాటి అయినను అది పని చేయలేదు. ఒకని హృదయం మోసపూరితమైతే దేవాలయముతోడని ఒట్టుపెట్టుకొన్నా ప్రయోజనము లేకపోయింది (మత్తయి 23:1). అంత అక్రమ యుగంలో యేసు ఇట్లుబోధించారు: "నేను మితో చెప్పునదేమనగా - ఎంత మాత్రము ఒట్టుపెట్టుకొనవద్దు. ఆకాశము తోడనవద్దు, అది దేవుని సింహాసనము, భూమితోడనవద్దు అది ఆయన పాదపీఠము. యెరూషలేము తోడనవద్దు అది మహారాజు పట్టణము. నీతలతోడని ఒట్టుపెట్టుకొనవద్దు, నీవు ఒక వెంట్రుకనైనను తెలుపుగా గాని నలుపుగా గాని చేయలేవు. మీ మాట అవునంటే అవును కాదంటే కాదు అని యుండవలెను. వీటికి మించునది దుష్టుని నుండి పుట్టును" (మత్తయి 5:34-37).

యేసును వెంబడించువాడు తన యదార్థతను గూర్చి ఒట్టుపెట్టుకొననవుసరం లేదు, అతని మాటలు అవునంటే అవును, కాదంటే కాదు. అంతే !

మోసము అపవాది యొక్క పురాతన అస్త్రము. హవ్వను మోసగించుటకు వాడు దానిని ఉపయోగించాడు (ఆది.కా. 3:4). అరణ్యములో యేసును మోసగించాలని అతడు దానిని వాడాడు (మత్తయి 4:9). అననీయను మోసగించుటకు వాడు దానిని ఉపయోగించాడు (అపొ.కా 4:14). అపవాది నేడును తన పనిని కొనసాగించుటకు కొరకు దానిని వాడుచున్నాడు. అబద్ధికులందరు అగ్ని గంధకములతో మండు గుండములో పాలు పొందుదురని దేవుడు చెప్పారు (ప్రకట 21:8). అబద్ధమును జరిగించువాడెవడును పరలోకములో ప్రవేశింపడు (ప్రకట 21:27). అబద్ధికుడు అబద్ధములాడుట మానుకోవాలి లేదా పరలోకమును కోల్పోవాలి. అతడు రెండింటిని పాటించలేడు.

క్రైస్తవుడెప్పుడు అసత్యమాటలు పలుకకూడదు "సత్యమునకు విరోధముగా అబద్ధమాడవద్దు" అని బైబిలు చెప్పుచున్నది (యాకోబు 3:4). "ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి, మీరు పరిత్యజించి ... నవీన, స్వభావమును ధరించుకొనియున్నారు" (కొలస్స3:9-10). క్రైస్తవుడెన్నడు ఒట్టు పెట్టుకొనరాదు. అతడు క్రీస్తు శిష్యుడు గనుక ఎల్ల వేళలా సత్యమునే పలుకును "మీరు అబద్ధ మాడుట మాని ప్రతి వాడును తన పొరుగు వానితో సత్యమే మాటలాడవలెను" (ఎఫెసీ 4:25).

- జిమ్మీ జివేదన్

# నీవింకను బాటిల్‌తోనే యున్నావా ?

## (Are you Still on the Bottle ?)

నీవింకను బాటిల్‌తోనే యున్నావా? బీరు, విస్కీ బాటిల్ కాదు, పాల సీసా ! అపో.పౌలు కొరింథీయులకు మొదటిసారి వ్రాస్తు, "సహోదరులారా, ఆత్మసంబంధమైన మనుష్యులతో మాటలాడినట్లు నేను మీతో మాటలాడలేకపోతిని. శరీర సంబంధ మనుష్యులే అనియు క్రీస్తునందు పసిబిడ్డలే అనియు మీతో మాటలాడ వలసి వచ్చెను. అప్పటిలో మీకు బలము చాలకపోయినందున పాలతోనే మిమ్మును పెంచితిని గాని అన్నముతో మిమ్మును పెంచలేదు" (1కొరింథీ 3:1-2).

కొరింథీయులలో ఆత్మీయాభివృద్ధి, బలములేనందున వారు ఖండించబడ్డారు. వారికి తరుణము, సమయము కూడ లభించినది గాని ఆత్మీయ మరుగుజ్జులు! వారు పెరుగుచు బలమైన ఆహారమును గైకొన వలసి యున్నది, గాని వారింకా బాటిల్‌తోనే పాలు త్రాగుచున్నారు.

కొరింథీయుల వంటివారివలె క్రీస్తు సంఘములో నేడు అనేకులున్నారు. వారికి ఎల్లప్పుడు బోధింపబడాలి, వారు బోధించరు గాని ఏచిన్న అసౌకర్యము కలిగిన ముందు గొడవచేస్తారు. వారు యితరులను ఎన్నడు ప్రోత్సహించరు, గాని వారే ప్రోత్సహించబడాలి. లోతైన ఆత్మీయ సమస్యలను వారు ఎన్నడు అధిగమించరు, వాటి విషయమై అవగాహన వారికి వుండదు.

హెబ్రీ పత్రిక లేఖకుడిట్లనుచున్నాడు: "కాలమును బట్టి చూచితే మీరు బోధకులుగా యుండవలసిన వారై యుండగా దేవోక్తులలో మొదటి మూల పాఠములను ఒకడు మీకు మరల బోధింపవలసి వచ్చెను. మీరు పాలుత్రాగవలసిన వారే గాని బలమైన ఆహారము తినగల వారు కారు. మరియు పాలు త్రాగు ప్రతివాడును శిశువే గనుక నీతివాక్య విషయములో అనుభవము లేని వాడై యున్నాడు. వయస్సు వచ్చిన వారు అభ్యాసము చేత మేలు కీడులను వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియములు కలిగి యున్నారు గనుక బలమైన ఆహారము వారికే తగును" (హెబ్రీ 5:12-14).

దీనిని బట్టి క్రీస్తు సంఘములలో ఉపదేశకుల కొరత ఎందుకున్నదో మనము గ్రహించుకొనగలము. దేవుని బిడ్డయైన ప్రతివాడు ఆసక్తిగల విద్యార్థి వలె బైబిలును చదువుచు యితరులకు సువార్త బోధించుబలమైన సువార్తికుని వలె తయారగును గాక; బాటిల్‌ను విసర్జించి బైబిలును లోతుగా అధ్యయనము చేయుదముగాక !

**- బిల్ డిల్లాన్**

## సంక్షిప్త వార్తలు

2014 జూన్ 1,2,3 తేదిలలో కరక్కాయపేట క్రీస్తు సంఘమువారు నిర్వహించిన సువార్త మహాసభలు అత్యంత ఘనంగా జరిగినవి. ఈ సువార్త మహాసభలలో ప్రముఖ దైవజనులైన బ్రదర్ జాషువా గూటంగారు అద్భుత దైవ వర్తమానమును అందించిరి. కవిత గూటంగారు, హరిత గూటంగారు పాలుపొంది స్థానిక పరిచర్యను బలపరిచిరి. బ్రదర్ వి. రాజ్‌కుమార్, బ్రదర్ పి.యస్. ఆర్ జయపాల్ గారు (ర్యాలి) బ్రదర్ విశ్వేశ్వరరావు (కొవ్వురు) గార్లు మంచి వివరణతో కూడిన దైవ వర్తమానములను అందించిరి. వివిధ ప్రాంతములనుండి విచ్చేసిన సహోదరి సహోదరులు కోనసీమ ప్రాంతవాసులు ఆత్మీయంగా బలపరచబడిరి. స్థానిక క్రీస్తు సంఘము ఈ సువార్త మహాసభలలో పాల్గొనిన వారందరికి మంచి అతిధ్యమునిచ్చిరి. సీనియర్ సువార్తికులైన బ్రదర్ వి.జె ప్రానిస్స్ గారు మరియు వారి తనయులు వి. రాజహకుమార్ గారు వి.బాబిగారు, అమలాపురం మరియు కోనసీమలోని వివిధ ప్రాంతములలో సత్య వాక్యమును బలపరచుచున్నారు.

2014 జూన్ 12వ తేదీ కాట్రేనికోన మండలం కొప్పిగుంటలో సువార్త కూటము జరిగెను. తీవ్రమైన వడగాల్పులున్నను అనేకులు హాజరై సత్యసువార్తను వినిరి. సోదరులు యన్. జగజీవన్‌రాజు (దేవగుప్తం) గారు చక్కటి వాక్యపరిచర్య చేసిరి. పల్లంకుర్రు, దొంతికుర్రు, కొప్పిగుంట ప్రాంతములలో సోదరులు బూల యోహాను గారు, వారి కుమారుడు చిరంజీవి చాలకాలము నుండి నమ్మకముగా సువార్త చాటుచున్నారు.

2014 జూన్ 26వ తేదీనాడు జూషువాగూటం గారు సతీసమేతముగా నూజివీడు చేరుకొనిరి. 27వ తేదీ శుక్రవారం మైలవరంలో జరిగిన స్థానిక సంఘ వార్షిక కూటములో పాల్గొని ఉదయం, మద్యాహ్నం కూడ వాక్యపరిచర్య చేసిరి. అనాటి కూటమునకు బ్రదర్ రాజ్‌కుమార్ (విజయవాడ – వాంబేకోలనీ) గారు అధ్యక్షతవహించి సభను చక్కగా నిర్వహించిరి. ఏలూరులో పనిచేయుచున్న బ్రదర్ సదానందకుమార్ గారు కూడ ఉదయం చక్కటి వాక్యపరిచర్య చేసిరి. స్థానిక సంఘమును బలముగా నడిపించుచున్నారు. సోదరులు ఓర్సు అదాముగారు యేసుక్రీస్తు దేవుడైయున్నాడని గంభీర ఉపన్యాసము చేసిరి. స్థానిక సంఘము హాజరైనవారందరికీ

మంచి భోజన ఏర్పాట్లు చేసిరి. మైలవరంలో సోదరులు ఓర్సు ప్రభుదాసు గారు క్రీస్తు పరిచర్యను నమ్మకముగా చేయుచుస్థానిక సంఘము బలముగా నడిపించుచున్నారు.

2014 జూన్ 26వ తేదీ రాత్రి మైలవరం మండలం వెల్వదం గ్రామములో మంచి సువార్తకూటము జరిగెను. స్థానికసంఘస్థులు అనేకులు హాజరై దేవుని వాక్యమును ఆసక్తితో ఆలకించిరి. సోదరులు జాషువా గూటం గారు సతీసమేతముగా హాజరై వాక్యపరిచర్య ద్వారా సంఘమును ఎంతగా నో బలపరచిరి. వెల్వడంలో సోదరులు యేసుబాబుగారు చక్కగా పనిచేయుచు సంఘమును క్రీస్తులో నడిపించుచున్నారు. మైలవరం, నూజివీడు, వెల్వడం ప్రాంతములలో ఓర్సు ప్రసాదరావ్ గారు, వారికుమారులు ఆదాము, ప్రభుదాసు గార్లు నిర్విరామ కృషి చేయుచు ప్రభువు పనిలో ముందుకు సాగుచున్నారు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014

To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004